దామగుండం రెడీ!

నేవీ రాడార్ స్టేషన్‌కు నేడు శంకుస్థాపన

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

వికారాబాద్ (ప్రతినిధి)/పూడూరు, అక్టోబరు 14,(ఆంధ్రజ్యోతి) : వెరీ లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుతో దామగుండం పేరు అంతర్జాతీయ చిత్రపటంలో చేరనుంది. దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేసే విషయాన్ని కేంద్ర రక్షణ శాఖ, భారత నావి కాదళం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. గత 14 ఏళ్లుగా న్యాయ పోరాటాలను అధిగమించి ఎట్టకేలకు నేవీ రాడార్ స్టేషన్ కార్యరూపం దాల్చే వరకు చేరుకుంది. దామగుండం నేవీ రాడార్ కేంద్రం నిర్మాణం పనులకు మంగళవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ భద్రత, నిఘా, సెక్యూరిటీ వింగ్ అధికారులతో పాటు వికారాబాద్ జిల్లా పోలీసులతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, సంగారెడ్డి జిల్లా పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. బందోబస్తు విధులకు సంబంధించి మన్నేగూడ జేకే ఫంక్షన్ హాల్‌లో పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దామగుండంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్ దేశంలోనే రెండవది. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ మొదటి వీఎల్ఎఫ్ స్టేషన్ 1990 నుంచి నావికా దళానికి


కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

మిగతా 7వ పేజీలో...


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్లు

మేడ్చల్ (ప్రతినిధి/ వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 55 దరఖాస్తులను స్వీకరించిన మాట్లాడారు. జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి 33 ఫిర్యాదులను స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు మీదుగా మరో రెండు రైళ్లు

తిరుపతికి స్పెషల్ ట్రైన్

ప్రయాణికులకు మరింత సౌకర్యం

7



ఏదీ బీ(ధీ)మా!

పత్తాలేని పంటల బీమా పథకం

అమలు కాని ఫసల్ బీమా యోజన

నాలుగేళ్లుగా అందని నష్టపరిహారం

తీవ్రంగా నష్టపోతున్న ఉమ్మడి జిల్లా రైతులు


కొత్త ప్రభుత్వం వచ్చినా మారని పరిస్థితి

ఆంధ్రజ్యోతి SURVEY సర్వే

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చే సమయానికి అతివృష్టి, లేదా అనావృష్టి కారణంగా రైతుల చేతికిరాకుండా పోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ఉండడానికి ప్రభుత్వాలు పంట బీమా పథకాలను తీసుకొచ్చాయి. కానీ ఈ బీమా గురించి ఉమ్మడి జిల్లాలోని మూడింట ఒక వంతు మంది రైతులకు కనీస అవగాహన లేని పరిస్థితి. ఈ బీమా పథకం రైతులకు ఏ విధంగా అందుతోంది? అధికారులు ఏ మేరకు నష్టాన్ని కచ్చితంగా అంచనా వేస్తున్నారు. తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5700 మంది రైతులతో మాట్లాడి (సర్వే ద్వారా) 'ఆంధ్రజ్యోతి' వివరాలు సేకరించింది.

ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంటల బీమా పథకంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే చేపట్టింది. ఒక్కో నియోజకవర్గం నుంచి 570 మంది చొప్పున మొత్తం 5,700 మంది రైతులను కలవడం జరిగింది. అందులో వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో 2,280 మంది రైతులు, రంగారెడ్డిలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో

మిగతా 7వ పేజీలో...



దంచికొట్టిన వాన

» కాలనీలు, రహదారులు జలమయం


పెద్దేముల్‌లో కురుస్తున్న వర్షం

తాండూరు/పెద్దేముల్, అక్టోబరు 14: వికారాబాద్ జిల్లాలో పలుచోట్ల వాన దంచికొట్టింది. సోమవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురియడంతో వరద ఉధృతంగా ప్రవహించింది. పెద్దేముల్ మండలంలో ఉదయం నుంచి ఎండతో ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం కాగానే చల్లబడింది. నల్లని మేఘాలు కమ్ముకుని జోరుగా వర్షం కురిసింది. ఈ వర్షం కంది పంటకు జీవం పోసినట్టైందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే పత్తిపంటను ముందుగా సాగుచేసిన రైతులకు కొంతవరకు నష్టం కలిగిస్తుందని పేర్కొంటున్నారు. పత్తికాయలు పగులుతున్నందున వర్షం వల్ల పత్తి నల్లబారుతుందని, తూకం కూడా తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. కాగా, తాండూరులో రెండు గుంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని భద్రేశ్వర్ చౌరస్తా, శాంతినగర్ పార్కు, సాయిపూర్ , న్యూనలంద ప్రాంతం, ఆదర్శనగర్‌లో రహదారులు జలమయ్యాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు మెరుపులతో పాటు మబ్బులు కమ్ముకోవడంతో వాహనదారులు లైట్లు ప్రయాణాలు సాగించారు.

గ్రూప్-1 పరీక్షకు 27 కేంద్రాలు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



మేడ్చల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరుగనున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, ప్రతి రోజు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోని అనుమతిస్తామన్నారు.



ధాన్యం సేకరణకు సన్నాహాలు

» మేడ్చల్ జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు

» 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు మేడ్చల్ జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మేడ్చల్, డబీల్‌పూర్, పూడూరు, శామీర్‌పేట, కీసర, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం, మూడుచింతలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం 10,454 ఎకరాల్లో వరిసాగు చేయగా 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 13,015 ఎకరాల్లో విస్తీర్ణం పెరగడంతో దిగుబడి కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. గ్రేడ్ - ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300కు పెంచారు. ధాన్యం కొనుగోలులో భాగంగా ఈసారి కొనుగోలు కేంద్రాల వద్ద సన్న, దొడ్డు రకాలధాన్యాన్ని వేర్వేరుగా సేకరించనున్నారు. ఇందుకు సివిల్ సప్లయ్ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తున్నది. దాదాపు 3 వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నాలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నలకు ఈసారి ప్రభుత్వం రైతులకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లించనుంది.

గోనె సంచులు సిద్ధం

ధాన్యం కొనుగోళ్ల కోసం అవసరమైన గోనె సంచులు అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం 7లక్షల గన్నీ బ్యాగులు అవసరముండగా 7.5 లక్షల బ్యాగులను సిద్ధం చేశారు. అదనంగా మరో 50 వేల బ్యాగులను ముందస్తుగా సిద్ధం చేశారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు ఇతర సామగ్రి అవసరమైనన్ని అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని 5రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చేందుకు చర్యలు చేపట్టామని అధికారులు వివరించారు. కొనుగోలు కేంద్రాలకు తరలివచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



మేడ్చల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గన్నీ బ్యాగులను కూడా సిద్ధంగా ఉంచాం. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. దళారులను ఆశ్రయించవద్దు. రైతులకు డబ్బులు కూడా వెంటనే అకౌంట్‌లలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఎల్.సుగుణ బాయి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు

ఆ ఆలయం.. దొంగలకు కేంద్రం

» అమ్మవారిని దర్శించుకున్నాకే చోరీలు

» వాటాల పంపిణీ సైతం ఆలయంలోనే..

» దొంగల మైసమ్మగా ప్రాచుర్యం

» శామీర్‌పేట మండలంలో ఆలయం

శామీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆ ఆలయం దొంగలకు అడ్డా. అక్కడ పూజ చేయనిదే వారి దిన చర్య పూర్తవదంటే అతిశయోక్తి కాదు. దొంగతనానికి వెళ్లాలంటే ఆ అమ్మవారిని మొక్కాల్సిందే. చోరీ అనంతరమూ అక్కడికొచ్చాకే వాటాలు వేసుకునేవారు. ఆలస్యం అయితే అక్కడే బస చేసేవారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పొక్కడంతో దొంగల మైసమ్మ ఆలయంగా పేరుపడింది. అప్పటి నుంచి ఆ గుడి చుట్టుపక్కల నుంచి వెళ్లాలంటేనే జనాలు భయభ్రాంతులకు గురయ్యేవారు. ఇంతటి చరిత్ర కలిగిన ఆలయం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలంలో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్నది.

నాడు దొంగలకు అడ్డాగా ఉన్న మైసమ్మ దేవాలయం నేడు రాష్ట్ర రాజీవ్ రహదారిలో దొంగల మైసమ్మగా పెద్దఎత్తున అభివృద్ధి చెందింది. హైదరాబాద్ కరీంనగర్ వెళ్లే రోడ్డులో తూంకుంట మండల కేంద్రానికి మధ్యలో దాదాపు వంద సంవత్సరాల క్రితం మైసమ్మ అమ్మవారి ఆలయం ఉండేది. ఇది దొంగలకు అడ్డాగా ఉండేది. ఈ గుడి పరిసరాలు దట్టమైన అడవితో ఉండేవి. అక్కడి నుంచి ప్రయాణించాలంటేనే జనాలు జంకేవారు. ఆ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో దొంగలు అనువుగా ఉందని ఎంచుకునేవారు. రాత్రి సమయాల్లో ఆ గుడి వద్దకు చేరుకుని అమ్మవారిని దర్శంచుకున్నాకే దొంగతానానిక వెళ్లేవారు. పని ముగించుకుని తిరిగి అక్కడికి వచ్చి దోపిడీ చేసిన సొత్తును పంచుకునేవారు. దొంగలు ఆశ్రయం పొందడంతో ఆ దేవాలయం దొంగల మైసమ్మగా పేరుగాంచింది. కాలక్రమేణ ఆలయం పెద్దఎత్తున అభివృద్ధి చెందింది. దొంగల అలజడి లేనప్పటికీ ఆలయం పేరు దొంగల మైసమ్మగానే పిలువబడుతోంది. భక్తుల రాకతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.



ఆలయ ప్రధాన ద్వారం


మైసమ్మ అమ్మవారు

సొంత నిధులతో అభివృద్ధి

ఈ ఆలయం ఉన్న స్థలం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట గ్రామ మాజీ సర్పంచ్ దయాసాగర్ యాదవ్‌కు చెందింది. ఈ స్థలంలో గతంలో సాగు చేసుకుని జీవనోపాధి పొందేవారు. కొందరు అక్రమార్కుల చర్యలతో ఆ స్థలం వివాదంలో చిక్కుకుంది. న్యాయస్థానాన్ని ఆశ్రయించి 1994లో సమస్యను పరిష్కరించుకున్నారు. ఎవరి నుంచి విరాళాలు సేకరించకుండా తన సొంత ఖర్చులతో ఆ ఆలయాన్ని దశల వారీగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం మైసమ్మ ఆలయంతో పాటు ఎల్లమ్మ, నల్లపోచమ్మ, దుర్గామాత, నాగదేవత అమ్మవార్లకు ఆలయాలు నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. ఘట్‌కేసర్, హైదరాబాద్, కరీంనగర్ నుంచి వచ్చే వారికి ఈ చౌరస్తా ప్రధాన సెంటర్‌గా ఉంది. దేవాలయం ముందున్న కరీంనగర్ రోడ్డు రాజీవ్ రహదారిగా విస్తరించడంతో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. నిత్యం వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు.

ఇలవేల్పుగా కొలుస్తున్నాం



మైసమ్మ అమ్మవారిని మా పూర్వీకులు ప్రతిష్ఠించారు. అమ్మవారిని మాఇంటి ఇలవేల్పుగా కొలుచుకుంటున్నాం. రాత్రి సమయాల్లో దొంగలు ఇక్కడికి చేరుకుని, అమ్మవారిని పూజించేవారని పెద్దవాళ్లు చెప్పుండేవారు. కాలక్రమేణా దొంగల మైసమ్మగా పిలవడం అలవాటుగా మారింది.

-దయాసాగర్ యాదవ్, తూంకుంట మాజీ సర్పంచ్, ఆలయ నిర్వాహకుడు

మహిమగల అమ్మవారు



అమ్మవారు.. మహిమగలిగిన మైసమ్మ. అమ్మవారిని తలుచుకోవడంతోనే కోరికలు తీరుతాయని నమ్మకం. ఈ కారణం చేతనే స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు. వాహనదారులు తప్పకుండా అమ్మవారిని దర్శించుకొని, కాసేపు సేద తీరుతారు.

- రాంచందర్, భక్తుడు, తూంకుంట

దుర్గామాత నిమజ్జనంలో ఘర్షణ

నాగులపల్లిలో పోలీసుల పికెట్

పెద్దేముల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత నిమజ్జనం సందర్భంగా నాగులపల్లి గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ఆదివారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి గ్రామంలో గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగులపల్లిలో ఓ యువకుడు దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసిన చోట బైకుపై నుంచి కిందపడిపోయాడు. దీంతో ఆ యువకుడు ఆగ్రహానికి గురయ్యాడు. ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేయడంతోనే ప్రమాదం జరిగిందని మండిపడ్డాడు. దీంతో ఘర్షణకు దారితీసింది. ఆదివారం రాత్రి నిమజ్జనం సమయంలో ఆ యువకుడి తరుపున కొంతమంది వచ్చి అమ్మవారి నిమజ్జన ఊరేగింపునకు అడ్డుపడ్డారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ గిరితో పాటు పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఉదయం తాండూరు రూరల్ సీఐ అశోక్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. గొడవలు పడకుండా అందరూ శాంతియుతంగా ఉండాలని సూచించారు. సోమవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉన్నప్పటికీ ముందు జాగ్రత్తగా పోలీస్‌పికెట్ కొనసాగిస్తున్నారు.

కొడంగల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కొడంగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలు దసరా పండగను పురస్కరించుకొని స్వగ్రామాలకు చేరుకున్నారు. పండుగ అనంతరం సోమవారం తిరిగి హైదరాబాద్, పూణే, ముంబై, షోలాపూర్ తదితర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండటంతో రద్దీగా మారింది. ప్రయాణికులకు తగ్గట్లు బస్సులు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరారు.


కొడంగల్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు

వీధి కుక్కల స్వైరవిహారం



గుంపులుగా వెళ్తున్న కుక్కలు

కేశంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ.. దాడులకు తెగబడుతున్నాయి. దీంతో ప్రజలు వాటిని చూస్తనే బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా మండలపరిధిలోని కేశంపేట, కొత్తపేట, వేముల్‌నర్వ, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం, తొమ్మిదిరేకుల, లింగంధన, కాకునూర్ గ్రామాల్లో వీధి కుక్కలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. వాహనలపై వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పౌల్ట్రీ యాజమానులు చనిపోయిన కోళ్లను ఆరుబయట పడవేయడంతో పాటు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు మాంసాన్ని ఎక్కడ పడితే అక్కడ పడి వేస్తుండటంతో కుక్కల సంచారం ఆ ప్రాతంలో ఎక్కువగా ఉంటుంది. మాంసానికి అలవాటు పడిన కుక్కలు మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. అలాగే లేగదూడలపై దాడుల చేసి చంపి తింటున్నాయి. కుక్కల నియంత్రణ లేకపోవడంతో గ్రామాలలో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగింది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీధి పోటు అంటూ రోడ్డుపై గోడ నిర్మాణం



మేడ్చల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని ఎన్‌జీవో కాలనీలో ఇంటికి వీధిపోటు తగిలి వాస్తులోపం కలిగిందంటూ ఓవ్యక్తి నేరుగా రోడ్డుపై ప్రీకాస్టింగ్ గోడను కట్టేశాడు. అసలే కాలనీ రోడ్లు తక్కువ వెడల్పుగా ఉండటంతో ఒక బండి ముందుకుపోతే ఇంకో బండి ముందుకు రాని పరిస్థితి. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న రోడ్డుపై విచ్చలవిడిగా గోడ నిర్మించటంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పట్ల స్థానిక కౌన్సిలర్‌కు, మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ గోడను మాత్రం తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో చేవేళ్ల, తాండూర్ ఎమ్మెల్యేలు

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సోమవారం రాత్రి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దామగుండం జేఏసీ నాయకులు

రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వికారాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దామగుండం పరిరక్షణ జేఏసీ నాయకులు గీత, ఆనంద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా నిరసన చేపట్టిన అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఇక్కడ రాడార్ సెంటర్ ఏర్పాటుతో వృక్షసంపద అంతరిస్తుందని, పక్షులు, మానవాళికి సైతం ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్‌ను మరో చోటుకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు మల్లేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, వెంకటయ్య, నర్సిములు, రాములు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

రైతు, ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

తాండూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కార్యాలయానికి వచ్చిన రైతుల, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలో ధరణికి సంబంధించిన సమస్యల పరిష్కారం గురించి తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు సమస్యలతో వస్తే వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయం చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా మాట్లాడి వారి సమస్య తెలుసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు ఉన్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు



ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు(ఫైల్)

మర్పల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన ఎర్ర ఏసుదాస్, యశోద దంపతులకు నలుగురు సంతానం. పెద్ద కుమార్తె నర్సుగా ఉద్యోగం చేస్తుంగడా కుమారుడు ప్రశాంత్‌కుమార్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. కానీ ఎప్పటికైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఇటీవలే విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా చిన్న కుమార్తె మేఘన, కోడలు అశ్విని ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా ఉద్యోగాలు సాధించారు. ఇటీవలే హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వారు నియామక పత్రాలు అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు.



చెరువులకు జలకళ

బషీరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు జలకళ సంతరించుకొని కళకళలాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లోకి పెద్ద మొత్తంలో వరద నీరు చేరింది. మండలంలోని నవాల్గ నల్లచెరువు నిండుకుండలా మారి రెండో సారి అలుగు పారుతోంది. నవాంద్గీ పెద్ద చెరువు, కాశీంపూర్ బీరప్ప చెరువు, మంతన్‌గౌడ్ ఊర చెరువులతో పాటు, మైల్వార్ అక్కలమ్మ, ఎల్లమ్మ, దామర్‌చెడ్ చెరువుల్లోకి ఎగువన అటవీ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది యాసంగి ఆయకట్టు సాగుకు ఇక ఢోకాలేదని ఆయా గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే సబితని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

నవాబుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని మండల బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్‌రెడ్డి, విజయ్, మొహ్మద్‌గౌస్, దయాకర్‌రెడ్డి, శాంతికుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏదీ బీ(ధీ)మా!

(5వ పేజీ తరువాయి)

మొత్తం 2,850 మంది రైతులు, మేడ్చల్ నియోజకవర్గంలో 570 మంది రైతులను కలిసి పంటల బీమా పథకంపై సమగ్ర సర్వే నిర్వహించారు. రైతులకు పంట బీమా గురించి తెలుసా అని అడిగిన ప్రశ్నకు తెలుసునని 2,763 మంది సమాధానం చెప్పగా, తెలియదని 1,815 మంది సమాధానం ఇచ్చారు. ఈ సర్వే వివరాలను గమనిస్తే రైతులకు పంటల బీమాపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమైనట్లు తెలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టి ఏర్పడి నష్టపోతే అధికారులు సర్వేను సమగ్రంగా చేపట్టడం లేదని 2,997 మంది చెప్పారు. అధికారులు గ్రామాలకు వెళ్లి పంటలను సందర్శించకుండా చెట్ల కింద కూర్చొని పంట నష్టాన్ని రాసుకుని వెళ్తున్నట్లు పలువురు రైతులు తెలిపారు. దీంతో నిజంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందడం లేదు. పంట నష్టం అంచనా వేయడం కూడా సరిగ్గా లేదంటున్నారు. పంట నష్టం అంచనా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలని అధిక సంఖ్యలో రైతులు చెబుతున్నారు. పంట నష్టపోయిన సమయంలో బీమా సొమ్మును సకాలంలో ప్రభుత్వమే చెల్లించాలని 4,206 మంది రైతులు తెలిపారు.

ఫసల్ బీమా నుంచి తప్పుకున్న ప్రభుత్వం


ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ఈ పథకం 2019-20 వరకు రాష్ట్రంలో కొనసాగింది. 2020లో ఈ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకుంది. అప్పటి నుంచి పంట బీమా పథకం లేకపోవడంతో విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులు పరిహారాన్ని అందుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సాగవుతున్న పంటలకు ప్రభుత్వం ధీమాను ఇవ్వలేకపోతుంది. ప్రధాన మంత్రి పసల్ బీమా పథకం నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రత్యేక బీమా పథకాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పినా ఇంత వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అమలవుతున్న బీమా పథకం తరహా ఇక్కడా తీసుకొస్తామని, అందుకు ఒక బృందం అక్కడికి వెళ్లి అధ్యయనం చేసి వచ్చిన తర్వాత నూతన బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆతర్వాత దాని ఊసే ఎత్తలేదు. ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతులకు బీమా రాక పెట్టుబడి లేక తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి.



వికారాబాద్ జిల్లాలో నీట మునిగిన పత్తి పంట(ఫైల్)

తీవ్రంగా నష్టపోతున్న రైతులు

రంగారెడ్డి జిల్లాలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా యోజన కింద 2018 ఖరీఫ్‌లో 25,650 మంది రైతులు 52,997 ఎకరాల విస్తీర్ణంలో నమోదు చేసుకున్నారు. 2019 సంవత్సరంలో 32,535 మంది రైతులు 61,232 ఎకరాల విస్తీర్ణంలో పంటలను నమోదు చేసుకున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, కంది, జొన్న, పత్తి, టమాట, శనగ, వేరుశనగ పంటలకు బీమా చేయించారు. సాధారణంగా ఫసల్ బీమాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిపి 95 శాతానికి పైగా బీమా ప్రీమియం చెల్లిస్తుండగా, మిగితా 1.5 శాతం నుంచి 5 శాతం వరకు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత పంట బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర సబ్సిడీతో పాటు రైతుల తరఫున ప్రీమియం సైతం ప్రభుత్వమే చెల్లిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ నుంచే ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటికే సగం సీజన్ దాటి పోయింది అయినా దాని ఊసే లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో 1,591 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 991 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వికారాబాద్‌లో 600 ఎకరాల విస్తీర్ణంలో పంటలు నీట మునిగాయి. అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినప్పటికీ పరిహారం మాత్రం రాలేదు. పంట బీమా పథకం లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పి ఇంత వరకూ కనీస మార్గదర్శకాలు విడుదల చేయని పరిస్థితి.



బీమా పాలసీ ఊసే లేదు

కొన్నేళ్లుగా పంటల బీమా పథకం అమలు కావడం లేదు. గత ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా అమలు చేసినప్పటికీ.. పంట బీమాను పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమాను ఉచితంగా అమలు చేస్తామని చెప్పింది. కానీ.. ఇంత వరకు ఆ ఊసేలేదు. పంట నష్టం జరిగినప్పుడు అధికారులు పంటల వారీగా అంచనా వేసి పరిహారం త్వరగా ఇవ్వాలి.

- రూపం వెంకట్‌రెడ్డి, రైతు, చింతలపలి(ఆమనగల్లు)

నేడు తాండూరులో ఎంపీ రఘునందన్‌రావు పర్యటన

తాండూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ పార్లమెట్ సభ్యుడు, బీజేపీ సభ్యత్వ నమోదు జోనల్ ఇన్‌చార్జి రఘునందర్‌రావు ఈనెల 15వ తేదీన (నేడు)న తాండూరులో పర్యటించినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణశాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భద్రేశ్వర్‌చౌక్‌లో ఉదయం 10.30 గంటలకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రచారి అభయ్ పాటిల్ ఆదేశానుసారం ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. తాండూరు నియోజకవర్గ బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో కౌన్సిలర్ కన్నుమూత



హిమ (ఫైల్)

ఘట్‌కేసర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ బైర హిమ(53) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతిచెందారు. ఇటీవల ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన హిమ అక్కడి నుండే 8వవార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. కాగా హిమది యాదాద్రి- భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామం కాగా పోచారం మున్సిపాలిటీ అర్జీకాలనీలో నివాసముంటున్నారు. నేడు మంగళవారం స్వగ్రామం గౌరాయపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కూతుళ్లు, ఐదు నెలల కుమారుడు ఉన్నారు. కౌన్సిలర్ హిమ మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితోపాటు సహచర కౌన్సిలర్లు ఆస్పత్రికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

నేడు రేణుకా ఎల్లమ్మ కల్యాణం

శామీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణం నేడు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలోని బొడ్రాయి, గ్రామ దేవతలకు బోనాలను నిర్వహించారు. సాయంత్రం గంగతెప్పను డోలు వాయిద్యాలతో ఊరేగించి ఆలయం వద్ద నీటిలో వదిలారు. మంగళవారం(నేడు) ఉదయం ఘటం తీయుట, లందకు వెల్లుట నిర్వహించనున్నారు. అనంతరం 11.45గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దామగుండం రెడీ!



(5వ పేజీ తరువాయి)

సేవలందిస్తుండగా, వికారాబాద్ జిల్లా, పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో 2వ వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ఏర్పాటు చేయబోతున్నారు. రూ.2500 కోట్లతో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్‌ను 2027 నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని కేంద్ర రక్షణ శాఖ భావిస్తోంది.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని దామగుండం అటవీ ప్రాంతంలో వీఎల్ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కేంద్ర నావికా దళ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మంగళవారం నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి జాతీయ భద్రత, నిఘా, సెక్యూరిటీ వింగ్ అధికారులు, నేవీ అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం శంకుస్థాపన జరిగే స్థలంతో పాటు వికారాబాద్ కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి పాల్గొన్నారు.

నిరసనలు

దామగుండం రిజర్వు ఫారెస్ట్‌లో నౌకాయాన దళం వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణానికి వేగంగా చర్యలు చేపడుతుండగా, మరోవైపు రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగుతూ వచ్చిన విషయం తెలిసిందే. రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం వికారాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. అయితే రాడార్ స్టేషన్ ఏర్పాటులో తీసుకుంటున్న నష్ట నివారణ చర్యలను పరిశీలించి సంతృప్తి చెందిన తరువాతనే రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఆమోద ముద్ర పడిందని అధికారులు చెబుతున్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

పరిగి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగుండం అటవిలో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపనను కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేయనున్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కంటే ముందుగా రానున్నారు. 11.15 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి బేగంపేట్ ఎయిర్‌పోర్టులో హెలికాప్టర్ ద్వారా వికారాబాద్ కలెక్టరేట్‌కు 11.55కు రానున్నారు. 11.55 నుంచి 12.30 గంటలకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి 12.45కు శంకుస్థాపన చేసే దామగుండం స్థలానికి చేరుకుంటారు. 12.45 నుంచి 1.45 వరకు నేవీరాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన, వేదికపై ప్రసంగం ఉంటుంది. తిరిగి రెండు గంటలకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో హెలిఫ్యాడ్ స్థలానికి చేరుకుంటారు. 2.15 గంటలకు వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో 2.45కు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

తాండూరు మీదుగా మరో రెండు రైళ్లు

తిరుపతికి స్పెషల్ ట్రైన్ • ప్రయాణికులకు మరింత సౌకర్యం



తాండూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాండూరు మీదుగా మరో రెండు స్పెషల్ రైళ్లు ప్రారంభమయ్యాయి. 2025 మార్చి వరకు ఈ రైళ్లు తాండూరు మీదుగా రాకపోకలు సాగించేలా దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయించింది. బెల్గావి నుంచి మణుగురు (రైలు నం. 07335), మణుగురు నుంచి బెల్గావి (రైలు నం. 07336), జల్నా టు తిరుపతి(రైలు నం.07621) తిరుపతి టు జల్నా (07622) రైళ్లను తాండూరు మీదుగా నడిపించాలని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు నిర్ణయించారు. బెల్గావి (07335) నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు వారంలో ఆది, బుధ, శని, మంగళవారాలు మణుగురు (07336)లో ప్రారంభమయ్యే రైలు సోమ, గురు, ఆది, బుధవారం తాండూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంది. జల్నా (07621) నుంచి ప్రారంభమయ్యే స్పెషల్ రైలు అక్టోబర్ 20, 27 నవంబర్ 3, తిరుపతి నుంచి ఈ నెల 21, 28 నవంబర్ 4న రాకపోకలు సాగిస్తుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. మణుగురు బెల్గావి ట్రైన్‌కు 18 కోచ్‌లుంటాయి, జల్నా - తిరుపతి ట్రైన్‌కు 18 కోట్‌లుంటాయి.

తిరుపతి - జల్నా ట్రైన్ టైమింగ్..

తిరుపతి (07622) రాత్రి 9.10 గంటలకు ప్రారంభమై సరిహద్దు కర్ణాటక సేడం స్టేషన్‌కు ఉదయం 6.43గంటలకు, వికారాబాద్ స్టేషన్‌కు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుంది. జల్నా నుంచి రాత్రి 7.21గంటలకు ప్రారంభమై బీదర్ స్టేషన్‌కు ఉదయం 4 గంటలకు, జహీరాబాద్ స్టేషన్‌కు 4.38గంటలకు, వికారాబాద్ స్టేషన్‌కు 5.30గంటలకు, తాండూరు స్టేషన్‌కు 6.13గంటలకు, కర్ణాటకలోని సేడం స్టేషన్‌కు ఉదయం 6.44గంటలకు చేరుకుంటుంది.

మణుగూరు - బెల్గావి రైలు వేళలు

రాత్రి 3.40 గంటలకు మణుగురులో ఈ రైలు ప్రారంభమవుతుంది. వికారాబాద్ స్టేషన్‌కు రాత్రి 11.37గంటలకు తాండూరు స్టేషన్‌కు అర్ధరాత్రి 12.7గంటలకు సేడం స్టేషన్‌కు అర్ధరాత్రి 12.34గంటలకు, భల్గామిలో అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి సేడం స్టేషన్‌కు ఉదయం 2.34గంటలకు, తాండూరు స్టేషన్‌కు ఉదయం 2.40గంటలకు, వికారాబాద్ జంక్షన్‌కు ఉదయం 3.34గంటలకుకు చేరుకుంటుంది. తాండూరు, వికారాబాద్‌లతో పాటు సరిహద్దు రాష్ట్రం కర్ణాటక ప్రయాణికులకు తిరుపతి వేంకటేశ్వర స్వామి, భద్రాచలం సీతారామచంద్ర దేవాలయాలను సందర్శించేందుకు రైళ్లు మరింత సౌకర్యవంతంగా మారాయి. కర్ణాటక రాష్ట్రంలో సేడం, యాద్గిర్ తాండూరు వికారాబాద్ స్టేషన్‌లలో ఈ రైళ్లు ఆగనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లను దసరా, దీపావళి, చాత్, క్రిస్మస్ సంక్రాంతి సందర్భంగా ప్రవేశపెట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

దామగుండం అడవిని రక్షించుకుందాం

- ధ్వంసం కానున్న సుమారు 12 లక్షల చెట్లు
- రాడార్ స్టేషన్‌తో దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలు
- పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు

పంజాగుట్ట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనంతగిరి కొండలలోని అటవీ భూములను భారత నావికాదళం ఏర్పాటు చేయనున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్)రాడార్ స్టేషన్ కోసం కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పర్యావరణ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ పాత్రికేయుడు సంపత్ అధ్యక్షతన 'దామగుండం విధ్వంసంపై పౌర సమాజం స్పందన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్ పర్యావరణవేత్త బాబురావు, బక్కా జడ్సన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, పాత్రికేయులు విఠల్, తులసీ చంద్,రాహుల్, తదితరులు మాట్లాడారు.

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా, 'సేవ్ దామగుండం' పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా హైదరాబాద్, వైజాగ్, ఢిల్లీ, జమ్మూ, భోపాల్, వరంగల్, తదితర ప్రాంతాలతో సహా 18కి పైగా నగరాల్లో, పట్టణాలలో నిరసనలు చేపట్టామని వారు తెలిపారు. దామగుండం అడవులు జీవవైవిధ్యంతో ఉంటాయని, విలువైన వృక్షాలు, జంతుజాలం, ఔషధ మొక్కలతో సహా వందలాది అరుదైన వృక్ష జాతులు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో 2,900 ఎకరాల అటవీ భూమిని ధ్వంసం చేయనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ సమస్యలు, ప్రజలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. చుట్టుపక్కల ఇరవై గ్రామాలలో నివసిస్తున్న సుమారు అరవై వేల మంది జీవితాలపై ప్రభావితం చూపుతాయని అన్నారు. ఐదేళ్లలో 12 లక్షలకు పైగా చెట్లను నరికివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందన్నారు. దామగుండం అడవులలో రాడార్ ప్రాజెక్టును కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

న్యూస్ బాక్స్

రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి



సీఎం రేవంత్‌రెడ్డితో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్

బొంరాస్‌పేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపించాలని రజక సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సి.రవీందర్ కోరారు. కొడంగల్‌లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి రిజర్వేషన్‌ను తీర్మానించాలని కోరినట్లు తెలిపారు. రజక కులస్తుల 77 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, ఎస్సీ రిజర్వేషన్ అంశాన్ని గతంలో 2016, డిసెంబరు 26న అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

నేవీ రాడార్ స్టేషన్‌తో మానవ మనుగడకే ముప్పు



గోవింద్‌నాయక్

పరిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దామగుండం నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పక్షులు, జీవరాశులతో పాటు మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, బీఎంపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోవింద్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాప్రజలు వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నాయని ప్రశ్నించారు. నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుతో జిల్లా ఏడారిగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. దామగుండం అడవిలో 12లక్షల చెట్లు ఉన్నాయని, ఇందులో ఎన్ని లక్షలు కొట్టివేస్తారో జిల్లా ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రజల్లో అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో 50 కి.మీ రేడియేషన్ ఉంటుందని పర్యావరణ నిపుణులే చెబుతున్నారని తెలిపారు. ఈసీ, మూసీ నదుల కన్న తల్లి దామగుండం అడవులని, ఈసీ, మూసీతోపాటు కాగ్నా కూడా ఏడీ జిల్లా మొత్తం ఏడారిగా మారుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండివైఖరిని మానుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే తమ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.



పరిగిలోని ఐదో వార్డులో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న అయ్యప్ప ఆలయం

అసంపూర్తిగా అయ్యప్ప ఆలయం

- 12 ఏళ్ల కిందట నిర్మాణానికి శ్రీకారం
- ఎప్పుడు పూర్తిచేస్తారని భక్తుల ఎదురుచూపులు

పరిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని ఐదవవార్డులో నిర్మించతలపెట్టిన అయ్యప్ప ఆలయం ఏళ్లుగా అసంపూర్తిగానే మిగిలింది. అయ్యప్ప గుడి నిర్మాణం చేపట్టనునందున ఆ ఏరియాను అయ్యప్పకాలనీగా మార్చుకున్నారు. అయ్యప్ప ఆలయ నిర్మాణానికి 12ఏళ్ల కిందట శ్రీకారం చుట్టారు. అప్పటి వరకు దాదాపుగా కోటి రూపాయలకుపైగా ఖర్చు చేశారు. అయితే నిర్మాణ విషయంలో కొందరి ఆధిపత్యం వల్ల జాప్యం జరుగుతోందని భక్తులు చెబుతున్నారు. పరిగిలో ఏటా వేలాది మంది భక్తులు అయ్యప్పమాల ధరిస్తుంటారు. భక్తుల కోరిక మేరకు పరిగిలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినప్పటికీ ఎందుకు జాప్యం చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినప్పుడు ఆ ప్రాంతంలో అసలు ఇళ్లు ఉండేవికావు. గుడి పనులు ప్రారంభించిన తర్వాత వందలాది మంది ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇళ్ల మధ్యలో ఆలయం నిర్మాణ దశలోనే శిథిలంగా కనిపిస్తోందని భక్తులు వాపోతున్నారు. పెద్దలంతా ఒకతాటిపైకి వచ్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని భక్తులు కోరుతున్నారు.

దాతలు ముందుకు రావాలి



మంచి సంకల్పంతో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఎందరో దాతలు ముందుకు వచ్చినా సమన్వయలోపంతో ముందుకు సాగడంలేదు. 12ఏళ్లుగా అసంపూర్తిగానే ఉంది. పరిగిలో వేలాది మంది భక్తులు అయ్యప్పమాల ధరిస్తారు. అయితే గుడి ఎప్పుడు పూర్తి చేస్తారని ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా కాలనీవాసులంతా మరోసారి సమావేశమై నిర్మాణానికి ముందుకు సాగేలా చూస్తాం.

- ప్రభు, ఆలయ నిర్మాణ కమిటీ కార్యదర్శి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ పరశురామ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా వీగం గ్రామానికి చెందిన గట్టు సాయి ఇంద్రనీల్ గౌడ్(31) అవుషాపూర్ తీన్మార్ హోటల్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం తెల్లవారుజామున ఘట్‌కేసర్ నుంచి అవుషాపూర్‌కు బైక్‌పై వెళ్తుతుండగా ఎన్ఎఫ్‌సీ నగర్ ఇండియన్ పెట్రోల్‌బంకు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిఇంద్రనీల్‌గౌడ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14: అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం అంగన్‌వాడీ కేంద్రంలోకి ఓ దుండగుడు ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి కేంద్రం వద్దకు వెళ్లగా తలుపులు పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా గ్యాస్‌స్టౌవ్, సిలిండర్, పాల్యప్యాకెట్లు, వేయింగ్ యంత్రం కనిపించలేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ దేవరాజ్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూడళ్ల వద్ద తొలగించిన మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలని స్థానిక కౌన్సిలర్లు కమిషనర్ నాగిరెడ్డికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. జాతీయ రహదారి రోడ్డు పనుల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని అత్వేల్లి 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన కూడళ్ల వద్ద మహనీయుల విగ్రహాలను తొలగించారని తెలిపారు. అట్టి విగ్రహాలను తిరిగి ఆవిష్కరించాలని కోరారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలో ప్రవేశించే కూడళ్ల వద్ద గతంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్, స్వామీ వివేకానంద, సుభాష్ చంద్రబోస్, వేమన విగ్రహాలను ఆవిష్కరించగా జాతీయ రహదారుల అధికారులు రోడ్డు నిర్మాణంలో భాగంగా వాటిని స్థానిక ప్రజాప్రతినిధులతో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తెలగించటం శోచనీయమన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ అధికారులతో చర్చించి మహనీయుల కొత్త విగ్రహాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు జాకట దేవరాజ్, మనస శ్రవణ్ గుప్తా, సరిత మల్లేష్ గౌడ్ ఉన్నారు.

మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్‌ను కలిసిన నేతలు



దేవేందర్‌గౌడ్‌తో గుండ్లపోచంపల్లి నేతలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మాజీ శాసన సభ్యుడు, మాజీ హోంమంత్రి టి.దేవేందర్‌గౌడ్‌ను స్థానిక నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, కొంపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌లతో పాటు పలువురు మేడ్చల్, గుండ్లపోచంపల్లికి చెందిన నాయకులు నగరం లోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

కులకచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం బొడ్రాయి ఉత్సవ విగ్రహాలనుగ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేపచెట్టుకు కల్లు ధార



హస్నాబాద్‌లో వేప చెట్టుకు కారుతున్న కల్లు

కొడంగల్ రూరల్, అక్టోబరు 14: ఈత చెట్టుకో.. తాటిచెట్టుకో కల్లు కారడం సహజం.. కానీ ఓ వేపచెట్టుకు కల్లు ధారగా కారుతోంది. వివరాల్లోకి వెళ్తే.. నియోజకవర్గంలోని దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్‌లో గాంధీచౌక్ సమీపంలోని చావిడి ఆవరణలో ఉన్న 50ఏళ్ల పైబడిన వేపచెట్టు పైభాగాన ఉన్న రంధ్రం నుంచి వారం రోజులుగా కల్లు ధారలా కారుతోంది. ఇది తెలిసి గ్రామస్థులు వేపకల్లు ఆరోగ్యానికి మంచిదని అనేక రోగాలు వేపకల్లు సేవిస్తే నయమవుతాయని, కళ్ల సమస్యలు దూరమవుతాయని భావించి సీసాల్లో పట్టుకెళ్తున్నారు.

ఉద్యోగాలు సాధించిన వారు ఉత్తమ సేవలందించాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు సాధించిన యువత ప్రజలకు సేవలందించి పేరుప్రతిష్ఠలు పొందాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. ఒకే సమయంలో మూడు ఉద్యోగాలు సాధించిన రాజేందర్, రాజేశ్‌లను సోమవారం ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగమంటేనే జీవితానికి ఒక భద్రత అని తెలిపారు. అందుకు ఉద్యోగాలు సాధించిన వారంతా తమ విధి నిర్వహణలో సేవలందించాలని సూచించారు. ఉద్యోగులకు సమాజంలో మంచి గౌరవం ఉంటుందని, దానిని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.భాస్కర్, సురేందర్‌రెడ్డి, వాజిద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



ప్రభుత్వ ఉద్యోగం సాధించిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కొడంగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న నందిగామ, దౌల్తాబాద్ మండలంలోని నందారం, టేకులకోడ్, కొడంగల్ గ్రామాలకు చెందిన పి.శ్రీనివాస్, భీమేశ్, కె.సాయిలు, కె.అరుణలు ఇటీవలే ప్రభుత్వం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆయా గ్రామాల్లో వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, అంబేద్కర్ సంఘం నాయకులు జగన్‌మోహన్, దస్తప్ప, వెంకటయ్య, రాములు, సాయిలు, నర్సింహులు, వెంకటయ్య, సాయిలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కులకచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరంపల్లి గ్రామంలో నక్క ఈరమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, రాజు, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటిస్నేహితులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. కులకచర్లకు చెందిన కాటన్‌పల్లి హనుమంతు పరిగి మండలం జాఫర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన స్వగృహం కులకచర్లలో కుటుంబసభ్యులు దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా 1993-94 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అంజిలయ్య పాల్గొన్నారు.

సీపీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత పెద్దేముల్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

పెద్దేముల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిట్టెపు ప్రకాష్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పెద్దేముల్‌కు చెందిన ప్రిన్స్ లెవెన్ నిలిచింది. మండల కేంద్రంలో వారం రోజులుగా చిట్టెపు ప్రకాష్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగింది. ఈ టోర్నమెంట్‌లో పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 27జట్లు పాల్గొన్నాయి. చివరకు తట్టెపల్లి లెవెన్, పెద్దేముల్ ప్రిన్స్ లెవెన్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రెండు జట్లు తలపడ్డాయి. మొదటగా తట్టెపల్లి లెవెన్ జట్టు బ్యాటింగ్‌చేసి 107 పరుగులు సాధించింది. 108 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన పెద్దేముల్ ప్రిన్స్‌లెవెన్ జట్టు నిర్ణీత ఓవర్లు ఆడి 107 పరుగులు సాధించింది. దీంతో మ్యాచ్‌టై అవడంతో సూపర్ ఓవరి ఆడించారు. అందులో పెద్దేముల్ ప్రిన్స్ లెవన్‌జట్టు గెలుపొందింది. విజేతగా నిలిచిన జట్టుకు కప్పుతో పాటు రూ 21వేలు నగదు, రన్నర్‌గా నిలిచిన తట్టెపల్లి జట్టుకు రూ 11వేలు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, గాజీపూర్ నారాయణరెడ్డి, రుద్రారం మహిపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌గుప్త, కిషన్‌రావు, జితేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, డీవై.నర్సింహులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులను కలుసుకోవడం గొప్ప అనుభూతి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులను కలుసుకోవడం గొప్ప అనుభూతి అని రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి తెలిపారు. కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2010-11 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో రాణిస్తుండడం ఎంతో గర్వకారణమన్నారు. దాదాపు 13ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు సమాజహితమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు అనంత్‌రెడ్డి, మొయినోద్దీన్, మాలిష్ ప్రతాప్, సత్యనారాయణరెడ్డి, అలిమోద్దీన్, అంజయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఐని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు



సీఐ పరశురామ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వచ్చిన ఘట్‌కేసర్ సీఐ పరశురామ్‌ను ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అవుషాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ గ్రామాలకు చెందిన నాయకులు సీఐని కలిసి శాలువాలతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీఐని కలిసిన వారిలో మామిండ్ల ముత్యాల్‌యాదవ్, ముల్లి జంగయ్యయాదవ్, రాజేష్ రాధాకృష్ణ, నర్సింగ్‌రావు, సుధాకర్‌రావు, కానుగంటి శ్రీనివాస్, నాగరాజు, మంకం రవి, మంకయ్య, శ్రీకాంత్, వెంకటేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు కౌన్సెలింగ్

వికారాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024లో ఎంపిక కాబడిన వారు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన వారికి కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీలు మధ్యాహ్నం 2గంటల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులందరూ అపాయింట్మెంట్ ఆర్డర్, రెండు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒరిగిన విద్యుత్ స్తంభంపై ఎంపీడీవో ఆరా

బషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'పొంచి ఉన్న ప్రమాదం.. రోడ్డుపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం' అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ సీరియస్‌గా స్పందించారు. ఈవిషయమై ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన విద్యుత్‌శాఖ సిబ్బందిని ఆరా తీశారు. ఈ క్రమంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదకారంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని వెంటనే సరిచేయించాలని సూచించారు. ఇందుకు ఆశాఖ అధికారులు స్పందిస్తూ మంగళవారం కాంట్రాక్టర్‌ను పంపించి స్తంభాన్ని సరిచేయిస్తామని చెప్పారని ఆయన వెల్లడించారు.

అవుషాపూర్‌లో భగవద్గీత గ్రంథాలు పంపిణీ



భగవద్గీత అందజేస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు దేవేంద్ర, ధన్వంతరి అన్నారు. అవుషాపూర్‌లో ఇంటింటికీ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వాసవి, పవన్ పాల్గొన్నారు.

మేడ్చల్ ఐటీఐలో ఆరు కొత్త కోర్సులు ప్రారంభం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఐటీఐలో కొత్తగా ఆరు కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.హనుమాన్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంవత్సరం పాటు కొనసాగే మేనిఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమిషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మేనిఫ్యాక్చరింగ్, ఆర్టీసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, కోర్సులకుగాను, రెండు సంవత్సరాల పాటు కొనసాగే బేసిక్ డిజైనర్ అండ్ వెర్చువల్ వెరిఫైర్(మెకానిక్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులను నూతనంగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈకోర్సుల్లో అడ్మిషన్ కోసం విద్యార్థులు పదో తరగతి పాసై 14సంవత్సరాలు పైబడి ఉండాలని తెలిపారు. అడ్మిషన్ పొందాలనుకునే వారు ఈనెల 19వరకు ఆన్‌లైన్‌లో ఐటీఐ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని నేరుగా ఉదయం 11గంటల వరకు తమ సర్టిఫికెట్లతో ఐటీఐకు రావాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు తూంకుంటలో ఇందిరమ్మ కమిటీల అవగాహన సమావేశం

శామీర్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11గంటలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్ తెలిపారు. ఆయన సోమవారం శామీర్‌పేటలో మీడియాకు వెల్లడించారు. ఈ సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు విచ్చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.